(గత సంచిక తరువాయి)

# మనిషిలోపలి విధ్వంసం



## అల్లం రాజయ్య

"అది కాదయ్యా!

ఎంతసేపు శవాన్ని ఉంచుతాం.
పొద్దున నాలుగున్నరకు చనిపోయాడు. ఇప్పటికే ఖరా బయ్యింది. పంచనామా చెయ్యాలి." స్టేషన్ మాస్టర్ నచ్చ చెప్పే ధోరణిలో.

"చెయ్యండ్లి" రాజారాం.

"అక్కడికే పోదాం." స్టేషన్ మాస్టర్.

"పోయి?"

"అక్కడ నువ్వు నీ కొడుకును చూసుకొని నవ్వేవు. మేం ఏడుస్తం." రైల్వే పోలీసు కోపంగా.

రాజారాం లేచి నిలబడి రైల్వే పోలీసు ముఖం లోకి చూశాడు. అక్కడ అతనికి కాలిపోయిన తునికె చెట్లు మొదలు కన్పించింది.

రంవాదనలు ఇష్టంలేని వానిలాగా రాజారాం లేచి నిలుచున్నాడు. నిజానికి కొడుకు శవం అతని మనుసులో ఎప్పుడో చూసుకున్నాడు. కొడుకు చనిపోవడం ఎప్పటి నుంచి ప్రారంభ మైంది అన్న విచిత్రమైన ఆలోచన కలిగింది. మనుషుల చావు ఒక ఘడియలో జరుగగలదన్న దానికన్నా అది సంవత్సరాల తరబడి జరుగు తుందనేది అతని నమ్మకం.

స్టేషన్ మాస్టర్ రైల్వే పోలీసు రూంలో నుంచి బయటకు నడిచినా కూడా రాజారాం కొడుకు చావు ఎప్పుడు ఎక్కడ ప్రారంభమైనదనేదీ తెలియక అక్కడే నిలుచున్నాడు.

"ఏమయ్యా రాజారాం" రైల్వే పోలీసు పిలిచాడు.

రాజారాం కలలో నడుస్తున్నట్టుగా రూం బయటకు వచ్చాడు. అక్కడి వాళ్లంతా రాజారాంను చుట్టు ముట్టారు.

"పాప కర్ముడున్నట్టున్నది" ఎవరో ముసలమ్మ గొణిగింది.

"ఏమయ్య ముఖం సూత్తే సదువు సాత్రం వచ్చినోని తీర్గున్నవ్ - ఇయ్యల్లిటి రేపటి కోమలి పోరగండ్లు మాటంటెబడ్తలేరు. కొడుకును కొట్టినవా? తిట్టి నవా?"

"నీకు అఖల్ లేదా?"

ఇలాంటి తిట్లుదీవెనలెన్నెన్నో - పిల్లలను ఎట్ల పెంచు కోవాలో సలహాలు - ఆ తిట్ల మీద రాజారాంకు ధ్యాస లేదు. అందరు చావడం ఎప్పుడు మొదలయ్యిందో నన్నట్టుగా వెతికాడు. చావును జయించిన వాళ్లున్నారా అని వెతికాడు.

రామేశం తలవంచుకొని నడుస్తున్న రాజారాం పక్కకు వచ్చి "నీకెందరు కొడుకులే" అన్నాడు తడి గొంతుతో ఆప్యాయంగా.

"ఒక్కడే." రాజారాం-

జనంలో కొందరికి మరీ కోపం పెరిగింది. "ఓరి జెష్టమ్మా ఒక్క కొడుకును సాది సవరచ్చేన చేసు కోలేంది నువ్వేం మనిషివిరా?" ఒక ముసలయ్య.

"ఛతెరి ఏ పాపకర్ముడన్నా గీదునియల కొడుకులు బిడ్డ సాదుకోనివాడుంటాడా?" ఒక నీడేడువాడు.

"ఇగో ఈడున్నడు గదా?"

"ఇయ్యల్లరేపు ఎవలరచ్చేన ఆళ్ల సేతుల్లున్నదా? అందు మంచిగనే బతుకుదామనుకుంటరు. కని పొట్ట

రాసిన రాత - ఆ పొల్లగానికి గకొర్త రాసిందు బమ్మదేవుడు.'' ఒక నడీడు మనిషి-

''మన గీతలన్నీ రాసేది మనుషులేనే-'' రాయేశం అన్నాడు.


రాజారాం ఏం మాట్లాడకుండా నడుస్తున్నాడు.

అతని వెంట మంది నడిచారు. రైల్వే పోలీసు స్టేషన్ మాస్టర్ ముందు నడుస్తున్నాడు.

పొద్దుగూకింది, పడమటి దిక్కు కాలి కూలిన గ్రామం దూరంగా కనిపించినట్టుగా నలుపు ఎరుపుల సంగమం.

రాజారాం బోరింగు నీటి పంపు దగ్గర ఆగాడు. ఎవరో బోరింగు కొట్టారు. రాజారాం ముఖం కదుక్కున్నాడు. కొన్ని నీళ్ల తాగాడు... జేబులు వెతుక్కున్నాడు. ఎవరో బీడి కట్ట అగ్గిపెట్టె ఇచ్చారు. ఎవరో సిగరెట్టివ్వబోతే తీసుకోలేదు. బీడికట్ట తిరిగి ఇవ్వబోతే ఇచ్చి వాపసు తీసుకోలేదు.

బీడి బస్స బస్స పీలుస్తూ రాజారాం నడుస్తున్నాడు.



అప్పటికే శవం దగ్గర మంది జమై పోయారు.

రాజారాం రైలు పట్టాల దగ్గర పడున్న తన మాంసాన్ని, నెత్తురును మాశాడు.

జనం రాజారాం ముఖాన్ని, అక్కడ పడున్న తల కాయను మార్చి మార్చి మాశారు. దాదాపు రెండింటిలో ఒకే పోలికలు, విచిత్రంగా రెండింటిలో ఒకే భావం.

రాజారాం ఒకరాతి బొమ్మలాగా నిలుచున్నాడు.

స్టేషన్ మాస్టర్ కనుసైగతో రైల్వే పోలీసు మొండెం మీది గుడ్డ తొలిగించాడు.

రాజారాం సత్తువ లేని వానిలాగా కాళ్లవేపు కూల బడ్డాడు.

''అబ్బ ఎంత నెనరు లేని గుండెనయ్యానీది.'' అన్నారెవరో?

రాయి, పాపకర్ముడులాంటి మాటలు ఒక వేపు ''అయ్యో కాసెపూసె చెట్టు'', అని ఇంకొక వేపు.

రాజారాం కు ఈ మాటలేవీ చేరడం లేదు. తని మనుసులో అనేక దృశ్యాలు రూపుకట్టసాగినయ్. కూలిపోయిన గుడిసెలు, పెంకలు కిందికి తోడిన పెంకుటెండ్లు, చెల్లా చెదురుగా పడిన ధాన్యం, తొక్కబడిన కుండా, గుర్గి, ధ్వంసమైన గ్రామం అతని మనుసులో రూపు కట్టింది.

ఇప్పుడు రాజారాం ఒక ధ్వంసమైన పల్లెలా వున్నాడు. ఎలుగడి బడి సొంతం కాలిపోయి వల్లారిన అడివిలా వున్నాడు. ఇంకిపోయిన నదిలా, నెర్రెలిచ్చిన ఎండిన చెరువులా వున్నాడు. మాటలు తెగిపోయిన మనిషిలా కూర్చున్నాడు.

ధ్వంసమైన పల్లెలో ఇల్లిల్లు తిరిగి మాసిన ఆకలేసిన దుక్కిటెద్దులా రాజారాం ఎప్పుడో మరిచి పోయిన తన బతుకు తాలుకూ శకలాలు చుట్టూ తచ్చాడు తున్నాడు. చిత్ర విచిత్రంగా ఆ శకలాలు అతని మనుసులో మె దల సాగినయ్. తన కొడుకు చావు తనకు పుట్టకముందెక్కడో ప్రారంభమైనట్లుగా అతనికి తోచింది.

ఒక అంగీ తప్ప లాగు లేని పిల్లవాడు తండ్రి వెంట ఉరుకు తున్నాడు. ఒక చేతిలో పార ఇంకో భుజం మీద మోటబొక్కెన గల రైతు నడుస్తున్నాడు. ఎండకు పిల్లవాడి పాదాలు మాడి పొయ్యాయి. తండ్రి తిదుతూ కుడి చంక కెక్కించుకున్నాడు. పిల్లవాడు మొక్కజొన్న కయలకు వచ్చిన పీసును మాపి ''నాయినా పీటికి మీసాలెక్కడి నుంచి వత్తయే'' అంటున్నాడు.

ధ్వంసమైన పల్లెలో ఎవరో ఏడుస్తున్నట్టుగా అన్పించింది. ముడుతలు పడ్డ ఎర్రతోలు, నీలం రాయి కొనలక పోగల గల తండ్రిని వాకిట్లో పడుకో బెట్టారు. తల్లి మీద పడి ఏడుస్తోంది... కడుపుల నరాలు బయటపడేలాగున దగ్గుతూ - ఏదుకొయ్యల్లా తల వెంట్రుకలు గలిగిన అన్న - పోలీసు పటేల్ కింద గుమాస్తా - బొనుగూపినట్టుగా మాట్లడే అంతెత్తు వదిన - అన్న తాగి తాగి చని పోయాడు. కుటుంబం కకావికలు - చదువు బడిలో నుంచి నాగలికి మార్పు - తండ్రి చావు మళ్లీ కన్పిం చింది. ఇద్దర్లో ఎవరు ముందు చనిపోయారో జ్ఞాపకం రావడం లేదు.

తను నాగలిని పట్టే నాటికి పదెకరాల భూమి - బాయికోసం అంజుమాన్ అప్పు - అప్పు తీరలేదు. తను మిర్చి పంట - ఇంజను కోసం మళ్లీ కొత్తగా చెలిసిన భూమి తనఖా బ్యాంకు అప్పు - కొరుకుడు రోగం - హల్లికల్లీ సున్నకు సున్న - బేంకువాళ్ల పెద్ద బండి తీసుకపోవడం. ఎరుపెక్కిన వెక్కిళ్లతో ఈ గజిబిజి మధ్య ఒక స్త్రీ రూపం కన్పించింది.

తన్నులు గుద్దులు తాగుడు. బిసతప్పిన యంత్రంలా తను తిరిగే నాటికి భార్య కలుపులకు, నాట్లకు కూలికి పోతున్నది. బీదతనపు చావులో నుంచి పిల్ల వాన్ని తీసుకొని వెళ్లి పోయింది. అప్పటి నుంచి రాజారాం మళ్లీ భార్య దగ్గరికి పోలేదు. తాగడం దొరగాంగదగ్గర చేత చేయించాడం. నెల పని చేస్తే మరో రెన్నెలు తిర్గడం - ఎక్కడ పడితే అక్కడ - ఊళ్లెకు పదాలచ్చినయ్... ఊళ్లో గొడవలు ప్రారంభమయ్యే నాటికి తను ''తునికి ఆకు కల్లం'' పట్టారు. గొడవ లేకుండా వాళ్లియ్యమన్న రేటు ఇచ్చినందుకు పోలీసులు పట్టుకపొయ్యారు. మరింకేమీ జ్ఞాపకం రాలేదు. ఊళ్లె ఒక యువకుడికి జమానతుగ పాత ఇంటిని రాయించాడు. పిల్లవాడెట్లో వెళ్లి పోయాడు. జమానతు డబ్బు కట్టమని ఆర్నెల్లు జైలు - ఆఖరుకు ఇల్లు జప్తు చేశారు. ఆ తరువాత తనెక్కడ తిర్గింది. ఏమి చేసింది. ఏమి జ్ఞాపకం లేదు...

రైల్వే పోలీసులు మొండాన్ని, తలను ఒక్క దగ్గర చేర్చారు. రైల్వే పోలీసొకాయన పంచనామా రాస్తున్నాడు. ఇంకొకాయన మందిని దూరం కొడుతున్నాడు.

''ఇంటినుంచి ఎప్పుడెల్లిపోయిండు'' స్టేషన్ మాస్టర్.

''ఎవలింటినుంచి?'' రాజారాం తేరుకొని.

''నీ ఇంటి నుంచి.''

రాజారాం మాట్లాడలేదు. తల మొండెం కలిసిన తన కొడుకును అక్కడ నిల్చున్న మందిని మార్చి మార్చి మాశాడు. వీడు తన కొడుకేనా? నాలుగేండ్ల పిల్లవాడి ముఖం ఎంత ముద్దొచ్చేది? వాడి కడుపులో ఎన్ని ప్రశ్నలుండేవి? వాడి చిన్న కండ్లు ఎంత ఆత్రంగా పిట్టను, జంతువును, చెట్టును మాసేవి? ఇక్కడ వీడి ముఖంలో ఏ ప్రశ్నలేదు. విధ్వంసమై పోయిందెప్పుడో?

''నీకు ఇల్లు లేదా?'' స్టేషన్ మాస్టర్‌కు కోపం వస్తోంది.

''లేదు.'' రాజారాం జ్ఞాపకాలు కొద్ది కొద్దిగా అతుక్కునే సమయంలో ఈ ప్రశ్నలేమిటి అన్నట్టుగా.

''ఎప్పుడు వెళ్లి పోయిండు.''

''ఎవలు?''

''నీ కొడుకేనయ్యా!''

రాజారాం మాట్లాడలేదు. అతనికి ఇంతకు ముందడిగిన ప్రశ్న జ్ఞాపకమే లేదు.

''నీ కొడుకు ఇంటి నుంచి ఎప్పుడు పోయినాడయ్యా!'' స్టేషన్ మాస్టర్-

జనానికి విసుగొచ్చింది. ''మెదడు పని జెత్తలేనట్టున్నది పాపం.'' ఎవరో మందిలో నుంచి -

''ఓ బత్త సారా వేత్తే పని చేస్తది.'' రాజారాం పక్కనున్న తను.

రామేశం ఉరికి రెండు సారా బత్తాలు తీసుకొచ్చాడు. అవి రెండు ఏమిటన్నట్టు కొత్తగా మాసి వద్దన్నాడు... సారా నిషా కన్నా ఏదో మత్తు అతన్ని ఆవహిస్తోంది. మొదట స్టేషన్లో కొచ్చినప్పుడు అతనికి ఏ మత్తు లేదు. ఏ జ్ఞాపకము, ఆలోచనలు లేవు. కాని ఇప్పుడేవేవో తిరుగుతున్నాయి.

''నీ కొడుక్కు ఎన్నేండ్లు?'' స్టేషన్ మాస్టర్.

సరిగ్గా రాజారాంకు అప్పుడు శవాన్ని తడిమి తడిమి మాడాలని కోరిక కల్గింది. అదే సమయంలో ఈ ప్రశ్న

''నాకెర్కతే-'' రాజారాం గొంతులో కాఠిన్యం.

అప్పుడు స్టేషన్లోనుంచీ ఒక స్త్రీఏడుపు విన్పించింది.

ఒక బక్కపలుచటి స్త్రీ గుండెలు బాదుకుంటూ ఏడుస్తూ శవం కేసి పరుగెత్తి కొచ్చింది. ఆమె వెనుకే క్రర ఊతంతో ఒక ముసలి వాడు. బక్క దుక్కి టెద్దుల్లాంటి ఇద్దరు రైతులు వచ్చారు.

ఆ స్త్రీ రాజారాం కన్న పేదగా అధ్వాన్నంగా వున్నది. నడి వయస్సులోనే ముసలిదై పోయినట్టుగా వున్నది. రెండు పాత చీరెలు కలిపి కుట్టిన రెండు రంగుల చీరె కట్టు కున్నది. అదైనా అక్కడక్కడ చిరిగి వున్నది. వెలిసిపోయిన పాత రయికె తొడుక్కున్నది. ఆ స్త్రీ వెంట్రుకలు విచ్చిపోయి వున్నాయి. ముఖంలో ఎముకలు తప్ప గోరెడు మాంసం లేదు.

"ఓరి కొడుకా! ఎంత పని కెత్తుకున్నవ్‌రా కొడుకా! మొన్న మునిమాపు నా బట్టు చేతులతోని బువ్వ బెడ్తి గాదు కొడుకా! మీ అవ్వచ్చింది గాదు కొడుకా! ఓరి మల్లయ్య మీ తాతచ్చిందుగాదు కొడుకా! మీ మామలు వచ్చిండ్లు గాదు కొడుకా! గీదిక్కుమల్లె అవ్వ కేం జెప్పి పోతివి కొడుకా! నిన్ను గంటి గని నీ రాత కనక పోతి కొడుకా! దేవుడా నీ గుల్లె రాయి వడ దేవుడా! నా బతుకు కుక్కలు సింపిన ఇత్తారి జేత్తివి దేవుడ. కన్నోడు సుకపెట్టకపాయె కొడుక - పాపకారి జల్మనాది కొడుక - కట్టుకున్నోడు సుకపెట్టకపాయె దేవుడా! అడివిల పొద్దు గూకింది గదర కొడుక - ఇగ నేను ఏ ఆశజూసుకొని బతుకాలె కొడుకా! నన్ను కొంటబోక పోతివి కొడుకా!" ఆ స్త్రీ ఆ శవాన్ని తడుముతూ, మధ్య మధ్య దుమ్ము నెత్తి మీద పోసుకుంటూ పిచ్చిదానిలా ఏడుస్తోంది.

అంతవరదాకా గడ్డ కట్టుకపోయిన మనుషుల బండ బారిన గుండెలు జాలు వారాయి. అక్కడ నిలుచున్న వాళ్ళందిర కళ్ళల్లో నీళ్లూరాయి.

"ఎంతైనే కన్న కడుపు కన్న కడుపే - పేగు చింపు కొని పుట్టిన కన్న కొడుకు తన కండ్ల ముంగటి మున్నె పోతే ఆడి దాని మనసు అవిసి పోతది" ఒక ముసలమ్మ బొల బొల ఏడుస్తూ చెప్పింది.

ఏడుపు అక్కడ తెరలు తెరలుగా చలిలా, చీకటిలా అందరిని చుట్టేసింది. పంచనామా రాసిన రైల్వే పోలీసు ఆ సంగతే మరిచి పోయాడు.


స్టేషన్ మాస్టర్ కళ్లద్దాలు తుడుచుకున్నాడు.

రాజారాంకు ఆ ఏడుపు ఎక్కడో విన్పిస్తోంది. ఆ ఏడుస్తున్న స్త్రీ తన భార్యేనా? తను ఆ స్త్రీ బతుకులో ఒకప్పుడు సగం పంచుకున్నాడా? ఆమె తను కలిసి మిరుప చెట్లల్లో, మొక్కజొన్న పెరడి మంచె మీద సద్ది మూట విప్పుకొని చెరి సగం తిన్నది వాస్తవమేనా? కాదు ఈ స్త్రీ ఆమె కానే కాదు. రాజారాం మనసులో పచ్చటి ముఖం, ఎర్రటి చెక్కిల్లు, ఎప్పుడూ నవ్వే ముఖం గలిగిన స్త్రీ మాత్రమే వున్నది. ఈ స్త్రీ ఒక దయ్యం లాగున్నది.

క్రర ఊతంగా నిలుచున్న ముసలయ్య కూలబడి 'ఊకోయే ఎల్లవ్వా! ఏడ్వేడ్సి నీ కనుపాపలు కారిపోతయి. ఎవని కొర్త ఆడనుబగించాలె అందరంబతుకచ్చినమా?" అన్నాడు.

"ఓ నాయినా నీ మనుమనికి ధైర్నం జెప్పు నాయిన, లేపు నాయిన్న" తండ్రి మీద పడి ఏడ్చింది. ఆ ముసలయ్య తన నరాలు దేలిన చేతుల మధ్య బిడ్డను అదుముకున్నాడు. బలహీనమైన ఆ చేతులు వనుకుతు న్నాయి.

ఎల్లమ్మ మరో పది నిమిషాలు పరి పరి విధాల. వర్ణిస్తూ ఏడ్చి ఏడుపు ఆపింది. అప్పుడు చూసింది కొడుకు కాళ్ళ వేపున కూర్చున్న మనిషిని, దయ్యాన్ని




చూసినట్టుగా జడుసుకున్నది.

"పో - నా కొడుకును ముట్టకు - నీ పాపకారి చెయ్యి తాకుతె నా కొడుకు ఇషమెక్కుతడు. నా బతుకు గంగల గల్పినవ్. నా కొడుకును నువ్వే సంపినవ్" అరిచింది. కొడుకు కాళ్ళను తనకేసి జరుపుకున్నది.

రాజారాంను ఎవరో లేపి అవెటో తీసుకపోయారు.

ఎల్లమ్మ మళ్ళీ కొడుకు మీద పడి 'మీ నాయిన నీ కట్టం సుకం సూడరాలే కొడుకా! నీ సావు సూడచ్చిందు కొడుకా! మల్లయ్య నన్నడిగిన సంగతులన్ని మీ నాయిన్న నడుగుదువు రారా కొడుక నా కొడుకా!"

రైల్వే పోలీసు తేరుకున్నాడు అతనేదో వేదాంతం చెప్పబోయాడు కాని నోరు పెగల లేదు.

రాజారాంకు ఈ ప్రశ్నలన్నీ సలుపుతున్నాయి. తన కొడుకును తన దగ్గరే వుంచుకుంటే చావక పోయే టోడా? తనే చచ్చిపోయినంక వాళ్ళ నెట్లా వుంచుకుం టాడు? తన చావు ఎప్పుడు ఆరంభ మయ్యింది. తన కలల ప్రపంచాన్ని ఎవలు విధ్వంసం చేశారు. ఎప్పుడు చేశారు. తన ఏడుపు ఎక్కడ ఎప్పుడు తెగిపోయింది. తను బండరాయా? తన నరాలు ఒక్కటొక్కటే పుటు క్కు పుటుక్కున తెంపిదెవలు? చనిపోయిన అన్నా!




చదువు ఆపి పెద్ద కుటుంబాన్ని సాదుక వచ్చినప్పుడా? మిరుప తోటకు కొరుకుడు రోగం తాకి మాడి పోయినప్పుడా? అప్పు కింద షావుకారి భూమి గుంజుకున్నప్పుడా? అంజుమన్ అప్పులు, తనఖా బ్యాంకు వాళ్ళు వేలం పాడినప్పుడా? సర్వం ఒక్కొక్కటే ఊడ్చుక పోయి రైతు, కూలిగా మారినప్పుడా? కాదు ఈ అన్నీ బొగ్గల్ల తన జీవనాడులు ఒక్కొక్కటే తెగి పోయినయ్.

అన్న చనిపోయినప్పుడు చదువుతున్న ఎనిమిదో తర గతి ఆపి ముసలి తండ్రితో, గుంటుకు కొట్టి ఎర్రటెం డలో నెత్తురు పేరిన అరి చేతులు మూసుకొని; నాయిన్న చని పోయి మొత్తం కుటుంబ భారం మీద పడ్డప్పుడు చెరువు కట్ట కింది మర్రి చెట్టు కింద కూలబడి వెక్కి వెక్కి తను ఇట్లాగే ఏడ్చాడు. ఒక్కొక్క ఎకరం అమ్మి ఒక్కొక్క అంగం కోసుకు పోతున్నట్టుగా విల విల లాడాడు. గిజ గిజ తన్నుకున్నాడు. మొత్తం భూమి అమ్మకంతో వేళ్ళు పూర్తిగా తెగి కూలిపోయిన చెట్టులా ఎండిపోయాడు. తన ఏడుపు ఆగిపోయింది.

ఈ విధ్వంసం ప్రతి పల్లెలో ప్రతి రైతు లోలోపల జరిగింది. రైతులంతా తమ గాయాల దాచుకొని విధ్వం సాన్ని మింగుకొని తిరుగుతున్నారు. తుఫాను గాలిలో ఎండుటాకుల్లా ఎగురుతున్నారు.

రైల్వే పోలీసు 'పంచనామా కాయిదం' తీసుకు వచ్చాడు. రాజారాం దాని మీద ఇంగ్లీషులో సంతకం చేశాడు.

శవాన్ని కదిలించారు. జనం కదిలారు. మాటలు, ఓదార్పులు శవాన్ని గుడ్డలో చుట్టుకొని రైల్వే స్టేషన్ బయటకు తీసుకు పోతున్నారు. ముసలి తండ్రి ఆసరగా ఎల్లమ్మ గుండెలు బాదుకుంటూ ఏడుస్తూ శవం వెనుకే వెళ్ళిపోయింది.

రాజారాం ఆ జనంతోపాటే స్టేషన్ బయటకు వచ్చాడు.

బండిలో వరి గడ్డి మెత్తగా పరిచి శవాన్ని పడుకో బెట్టారు. బండిలో కూర్చున్న ఎల్లమ్మ తలను వొళ్లో పెట్టుకొని పిచ్చిదానిలా ముద్దులాడుతోంది.

స్టేషన్ ముందు గల కరెంటు బుగ్గ వెలుతురులో అక్కడ నిలుచున్న మనుషుల నీడలు దయ్యాల గుం పులాగా వున్నాయి.

"తను మనుషులను, భూమిని, పంటలను ప్రేమి ంచ లేదా? తన భార్యను, కొడుకును, తండ్రిని కుటుం బాన్ని..." రాజారాం లోలోపల ఏదో మత్తులా పాకు తోంది. ఎక్కడో సన్నగా వొనుకు ప్రారంభమైంది.

ఒక్కసారి ఒకే ఒక్కసారి, కడసారి తన కొడుకును ఒళ్ళోకి తీసుకొని ముద్దాడితే నాలుగేండ్ల పిల్ల వాడు భుజం మీద కూర్చుండి ఏదో అడుగుతున్నాడు.

కాని బండి కదిలింది.

"బావా నువ్వు బండెక్కు". బండి నడిపే రాజా రాం బావమరిది అడిగిందు.

"అన్నీ కాలి కూలి బూడిదై పోయినంక బావెవ్వడే అన్న! మీ బావెన్నడో సచ్చి పేయిందు నేను ముండ బొడ్డిని - పోనియ్యి" అన్నది ఎల్లమ్మ.

బండి కదిలింది. స్టేషన్లో గంట మోగింది. ప్యాసెం జర్ రైలు గంట అది. జనమంతా తేరుకొని బిల బిల మంటూ ఎవరి జాగాలల్లోకి వాళ్ళు సర్దుకున్నారు.

ఆ స్టేషన్ ముందు ఎటు పోవాలో తెలియక రాజారాం ఒంటరిగా నిలబడిపోయాడు. అతన్ని పిలిచే వాళ్ళెవరు లేరు.

రాజారాం అడుగులు బండి వెళ్ళిన దిశలోనేపడ్డాయి.

రాజారాం నడుస్తున్నాడు. స్టేషన్ దూరమయ్యింది. బండి గీరెల చప్పుడు చీకట్లో విన్పిస్తోంది. పలుగు రాళ్ళు కమ్మల కింద నలుగుతున్న శబ్దం. చుట్టూ ఆవరించిన చీకటి - చిమ్మెట్ల రొద పేరు తెలియని రొద ఏదో మోగుతోంది. ఈత చెట్ల కమ్మల మీద మిణుగురులు ఎగురుతున్నాయి. పైన చుక్కల ఆకాశం, దూరంగా చుట్టు ప్రక్కన గల ఊళ్ళల్లో వీధి దీపాలు కొరివి దయ్యాల్లాగా బండి వెళ్ళి పోతున్నది. ఇప్పుడు గీరెల శబ్దం కూడా విన్పించడం లేదు. రాజారాం వెనుకబడిపోయాడు.

రాజారాం కాళ్ళు ఆగిపోయాయి. దారిలోనే కూలబడ్డాడు.

"ఓ బావో వత్తన్నవా?" బావమరిది కేక

రాజారాం జవాబుగా కేక వెయ్యలేదు. అతని కంఠశక్తి లేదు.

తను తప్పక వస్తడని బావమరిది అనుకున్నాడా? కొడుకు అంత్య క్రియలకు తను పోతున్నట్టా? నిజంగా ఈ రోజు పొద్దున రైలు కింద తల బెట్టి చనిపోయిన ఆ పిల్లవాడికి తను తండ్రేనా? కాలి కూలి బూడిదైన పల్లెలో కొడుకెవలు? తండ్రెవలు...

చలి అంతకంతకూ ఎక్కువైంది. దానికి తోడు కడుపులో ఆకలి మంట, చలికి దవడలువనుకుతున్నాయి... ఇప్పుడు అతనికి సారా ప్యాకెట్లు జ్ఞాపకం వచ్చాయి. మెదడు పొరల్లో ఈ తర్కానికి లొంగనిదేదో మెల్లె మెల్లెగా కరుగుతోంది. అది ఆకలి కన్నా, చలి కన్నా ఎక్కువ సలుపుతోంది. తల పగిలి పోతోంది.

తను బిగ్గరగా ఈ భూమి పుట్టిన కాడికి విన్పించేలాగున ఏడుస్తే ఎంత బాగుండును! కానీ ఏడుపు రాదు. ఆ లెక్కన ఆ బండి మీద పోయిన తల్లే తనకన్నా అదృష్టవంతురాలు.

లేచి నిలుచున్నాడు. అడుగులు తడబడతున్నాయి. తూలుతూ అటు వెనుకకు స్టేషన్ కేసి కాకుండా ముందు బండి పోయిన దారిలో కాకుండా తూర్పు కేసి నడువ సాగిండు... తొవ్వదారి లేదు. కొంత సేపు చిక్కురు బొక్కురుగా నడిచిన తరువాత ఒక బండ్ల బాట కన్పించింది. మరి కొంత దూరం నడిచిన తరువాత ఒక పెద్ద మర్రి చెట్టు వచ్చింది. అది "పోశమ్మ దేవత" మర్రి చెట్టు. ఆ మర్రి చెట్టు నుండి ఒక దారి రాజారాం పల్లెకు పోతుంది. మరొకదారి పెద్ద పల్లె టౌనుకు పోతుంది. మూడోది పంట పొలాల మీదుగా 'రామగిరి' అడవికి పోతుంది. నాలుగోది చెరువు కట్ట మీదుగా పొరుగూరికి పోతుంది.

ఆలోచనలు ఇంకిపోయి మర్రి చెట్టు క్రింద కూలబడి పోయి రెండు చేతులతో ముఖం, తల రుద్దుకుంటూ లోలోపల పూర్తిగా ధ్వంసమై పోయిన రైతు బిడ్డడు; రైతు బిడ్డడు రాజారాం ఏడుస్తున్నాడు. వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. పూర్తిగా బొట్టు బొట్టుగా కరిగి పోతూ భూమిలోకి ఇంకిపోతూ ఏడుస్తున్నాడు.

రాజారాం నాలుగు రోడ్ల కూడలిలో చిక్కటి చీకటిలో, గడ్డ కట్టిన చలిలో, ఆకలితో కొడుకును, సర్వస్వాన్ని పోగొట్టుకున్న దుఃఖంతో ఏడుస్తున్నాడు.

రాజారాం లోలోపల జరిగిన విధ్వంసాన్ని పూర్తిగా అర్థం చేసుకుని అతన్ని లేపి, గుండెకదుముకోగలిగిన 'బాటసారులు' నాలుగు బాటల్లో ఏ బాట నుంచి వస్తారో ఏమి?

●

# ఆంధ్రజ్యోతి

## సచిత్ర వార పత్రిక

### తెలుగు కళా సమితి, న్యూజెర్సీ ఆధ్వర్యంలో

# చిన్న కథల పోటీ

ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన కథలకు వరుసగా 500, 400, 300 రూపాయిలు, వెరసి 1,200 రూపాయిలు. తర్వాత, కథకు 200 రూపాయిల పారితోషికంతో తొమ్మిది కథలను, కథకు 150 రూపాయిల పారితోషికంతో పన్నెండు కథలను ప్రచురణకు ఎంపిక చేస్తాము.

500 + 400 + 300 = 1,200 రూపాయిలు.

200x9 = 1,800, 150x12 = 1,800 రూపాయిలు

గత సంవత్సరం వలెనే అమెరికాలోని తెలుగువారు 'ఆంధ్రజ్యోతి' సచిత్రవారపత్రిక ద్వారా ఈ ఏడుకూడా పై పోటీ జరపాలని నిశ్చయించారు. ఎంపికైన కథలకు బహుమతులు, పారితోషికం అందజేస్తున్నది 'తెలుగు కళా సమితి' న్యూఢిల్లీ వారు. అమెరికాలోని తెలుగువారికి అర్థమయ్యే సరళమైన భాషలో వుండడంతోపాటు, రచనలో తెలుగువారి జీవితాన్ని చిత్రించేవిగా వుండాలి. రచయితలు, రచయిత్రులు ఉత్సాహంతో పాల్గొని పోటీని విజయవంతం చేస్తారని ఆశిస్తున్నాము.

<u>కార్టూన్‌కు 50 రూపాయిల చొప్పున పన్నెండు కార్టూన్‌లను కూడా ఎంపిక చేస్తాము</u>

### నిబంధనలు

1. కథ అనువాదంకానీ, అనుకరణకానీ కాదని హామీ ఇవ్వాలి. కలం పేరుతో రాస్తే అసలు పేరును పేర్కొనాలి.
2. బహుమతులపైన, ఎంపికపైన తుది నిర్ణయం ఎడిటర్‌దే.
3. ప్రచురణను అంగీకరించని రచనలను తిప్పిపంపడం సాధ్యంకాదు కనుక వాటికి స్టాంపులు పంపనవసరం లేదు.
4. కథ రాతలో మూడున్నర అర తావులకు మించరాదు.
5. బహుమతి పొందిన కథలు, ఎంపికైన కథలు మొదట 'ఆంధ్రజ్యోతి'లో అచ్చయిన తర్వాత, తెలుగు కళా సమితి వారి మాసపత్రిక 'తెలుగు జ్యోతి'లో నెలకొకటి చొప్పున ప్రచురణ అవుతాయి.
6. కార్టూన్లు కూడా ఇదే పద్ధతిలో ప్రచురణ అవుతాయి.

<u>కథలు చేరవలసిన ఆఖరి తేదీ 15-5-'89</u>

—ఎడిటర్

'ఆంధ్రజ్యోతి' సచిత్రవారపత్రిక
పోస్టుబాక్స్ నెం. 712,
విజయవాడ-520 010.